క్లుప్తంగా

దాసరి రంగముని సేవలు చిరస్మరణీయం



రంగముని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కళాకారులు

కర్నూలు కల్చరల్: జిల్లా రంగస్థల కళారంగంలో సీనియర్ కళాకారుడు దాసరి రంగముని సేవలు చిరస్మరణీయమని కర్నూలు జిల్లా రంగ స్థల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుర్రపుసాల అంకయ్య అన్నారు. శనివారం మద్దూరునగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో కందుకూరి విశిష్ట పురస్కారం గ్రహీత దాసరి రంగముని సంస్మరణ సభ జరిగింది. కళాకారులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అంకయ్య మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా ఎందరో కళాకారులను తీర్చిదిద్ది కళామతల్లి ముద్దుబిడ్డగా నిలిచారన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి హనుమంతరాయ చౌదరి, కార్యనిర్వాహక కార్యదర్శి బైలుప్పుల షఫీవుల్లా, సభ్యులు సయ్యద్ రోషన్‌అలీ, తిరుపాల్, అజయ్‌కుమార్, మనోహర్‌బాబు, అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లో కమిషనర్

కర్నూలు (టౌన్): నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ రెండు రోజుల పాటు సెలవుల్లో ఉంటారు. వ్యక్తిగత పనులకు సంబంధించి తిరుపతి వెళుతున్నందున అందుబాటులో ఉండరని నగరపాలక కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. ఇన్‌చార్జ్ కమిషనర్‌గా డిప్యూటీ కమిషనర్ ఎస్‌వి.రమాదేవి వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

కర్నూలు చేరుకున్న బైక్ యాత్ర

కర్నూలు కల్చరల్: శ్రీరామ రాజ్యం హిందుత్వ చైతన్య వేదిక ఆధ్వర్యంలో అంబాబత్తుల అండకొండ రాముడు చేపట్టిన బైక్ యాత్ర శనివారం కర్నూలుకు చేరుకుంది. భజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, శ్రీరామ రాజ్యం హిందుత్వ చైతన్య వేదిక నాయకులు రవిరెడ్డి, వీహెచ్‌పీ నగర ఉపాధ్యక్షులు నాగరాజులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా మరుగున పడిన పుష్పగిరి గిరి ప్రదక్షిణ పునరుద్ధరణ మహా సంకల్ప దీక్షలో భాగంగా రాముడు ప్రచార యాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాప్ కల్యాణ్, ధరణి, తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న డాక్టర్ వేణుగోపాల్

కోడుమూరు రూరల్: ఈ ఏడాది ఏప్రిల్‌లో జరుగనున్న పదవ తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాల్ పేర్కొన్నారు. వర్కూరులోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడారు. పదవ తరగతి పరీక్షల్లో ఫిజికల్ సైన్స్, మ్యాథమెటిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులు కీలకమని, వాటిపై ఎక్కువగా దృష్టి సారించాలని సూచించారు. కష్టతరమైన సబ్జెక్టులపై విద్యార్థినులు పూర్తి స్థాయిలో పట్టు సాధిస్తే మంచి ఫలితాలను పొందే అవకాశం ఉంటుందన్నారు. రానున్న రెండు నెలలు విద్యార్థినులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో అలెస్కో శ్రీనివాసులు, సీఎంఏ కమ్యూనిటీ మొబైల్ ఆఫీసర్ సునీత, ప్రిన్సిపాల్ గౌసియాబేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

28న వాహనాల వేలం

కోడుమూరు రూరల్: కోడుమూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం, నాటుసారా రవాణా చేస్తూ పట్టుబడిన మూడు కార్లు, ఒక అశోక్‌లే లాండ్ వాహనాన్ని ఈ నెల 28వ తేదీ మంగళవారం బహిరంగ వేలం వేస్తున్నట్లు సెబ్ సీఐ శ్యామ్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు రూ.10000లు ధరావతు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని కోరారు. వాహనాలు దక్కించుకోని వారికి ధరావతు మొత్తం తిరిగి ఇస్తామన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : పఠాన్, యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా, సార్, వినరో భాగ్యము విష్ణు కథ, సెల్ఫీ, కోనసీమ థగ్స్
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : వీరసింహారెడ్డి, అమిగోస్, కోనసీమ థగ్స్, సార్, వినరో భాగ్యము విష్ణు కథ
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : వాల్తేరు వీరయ్య, సార్, వినరో భాగ్యము విష్ణు కథ
ఐనాక్స్ : యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా, రైటర్ పద్మభూషణ్, అవతార్ ది వే ఆఫ్ వాటర్, సెల్ఫీ, మిరపకాయ్, కొకైన్ బీర్, అలా మొదలైంది
భరత్ కాంప్లెక్స్ : మిరపకాయ్
రాజ్ : మిస్టర్ కింగ్, **శ్రీరామ** : డెడ్‌లైన్
విజయ : సార్

రోల్డ్ గోల్డ్‌ను మరిపించెన్

- గిల్ట్ నగలకు పెరుగుతున్న ఆదరణ
- ధర తక్కువ.. దొంగల భయం ఉండదు
- కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్న మహిళలు
- ఉమ్మడి జిల్లాలో ఏటా వ్యాపారం రూ.అరకోటి పైనే



వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలు

కర్నూలు(రాజ్‌విహార్): పసిడి ధరలు రోజురోజుకు పైకి ఎగబాకుతూ పేద, మధ్య తరగతి వర్గాలకు అందని ద్రాక్షగా మారుతోంది. మరోవైపు పెరుగుతున్న దొంగతనాలతో నగలు కొని ఇంట్లో పెట్టుకోవాలన్నా.. ఆభరణాలు ధరించి వీధిలో తిరగాలన్నా భయపడే పరిస్థితి ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో రోల్డ్ గోల్డ్ ఆభరణాలపై మహిళలు మక్కువ చూపుతున్నారు. మహిళలు ఇటీవల కాలంలో ఫంక్షన్లలో వీటినే ధరిస్తున్నారు. తక్కువ ఖర్చుతో, కోరుకున్న డిజైన్లలో ఈ నగలు లభిస్తుండడంతో వీటిని ధరించడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. మహిళల అభిరుచులకు తగ్గట్టుగా వందలాది డిజైన్లు అందుబాటులో ఉన్నాయి.

మార్కెట్లో వివిధ డిజైన్లు..

గోల్డ్ కి, రోల్డ్ గోల్డ్ కి పెద్ద తేడా ఏమీ తెలియదు. గోల్డ్ లో ఉన్న డిజైన్స్ రోల్డ్ లో కూడా దొరుకుతాయి. దీంతో జిల్లాలో రోల్డ్‌గోల్డ్, వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాల వాడకం పెరుగుతోంది. మెడలో వేసుకునే నెక్లెస్ (హారం), బ్యాగిల్స్, వడ్డాణం, వైట్ టాప్స్, వన్ కీ, జడ బిల్ల, చైన్స్, చెవి కమ్మలు, లాంగ్ నెక్లెస్, ఉంగరాలు, సాదా నెక్లెస్, డాలర్స్ తదితర రకాలు మార్కెట్లో వివిధ డిజైన్లలో అందుబాటులో ఉన్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏడాదికి రూ.50లక్షలకు పైగా వ్యాపారం జరుగుతున్నట్లు సమాచారం. కర్నూలుతో పాటు నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్ తదితర ప్రధాన పట్టణాలు, మండల కేంద్రాల్లో కూడా వీటి విక్రయ కేంద్రాలున్నాయి. ముఖ్యంగా చెన్నై, మచిలీపట్నం, హైదరాబాదు తదితర ప్రాంతాల నుంచి బీట్ మేకింగ్, పూస, మోతీ నగలను దిగుమతి చేసుకుంటున్నారు. రోజువారీగా వినియోగించే ఆభరణాలకు ఆరు నెలల పాటు గ్యారంటీ ఇస్తారు. ఇవి రంగుపోయి నా, తెల్లబడినా, నల్లబడినా తిరిగి మార్చుకోవచ్చు. శుభ కార్యాలు, పెళ్లిళ్లలో వినియోగించే వాటికి గ్యారంటీ ఉండదు. రోల్డ్‌గోల్, వన్‌గ్రామ్ బంగారం ఆభరణాలు బాడుగకు కూడా లభిస్తాయి. వీటిని బ్యూటీ పార్లర్ల నిర్వాహకులు, డ్రామా కంపెనీలకు రోజువారీ అద్దె ప్రతిపాదికన బాడుగకు ఇస్తున్నారు.

రోల్డ్ గోల్డ్ ఆభరణాల ధరలు ఇలా...

ఆభరణం పేరు	ప్రారంభపు ధర
నెక్లెస్	రూ.350
గాజులు	రూ.180
వడ్డాణం	రూ.350
వైట్ టాప్స్	రూ.150
వన్ కీ	రూ.150
జడ బిల్ల	రూ.350
చైన్స్	రూ.180
చెవి కమ్మలు	రూ.100
లాంగ్ నెక్లెస్	రూ.650
ఉంగరాలు	రూ.100
సాదా నెక్లెస్	రూ.450
డాలర్స్	రూ.100
బీట్ మేకింగ్	రూ.150
పూస మోతీ	రూ.120



రోల్డ్ గోల్డ్ వడ్డాణాలు



దొంగల భయం ఉండదు



దొంగల భయంతో బంగారం నగలు, ఆభరణాలు వేసుకొని రోడ్లపైకి వెళ్లాలంటేనే ఆందోళనకరంగా ఉంది. ప్రతి సారి ధరించలేము. దీంతో తక్కువ ధరకే లభించే రోల్డ్‌గోల్డ్ నగలు కూడా చూసేందుకు బాగుంటాయి. వీటిని వేసుకుంటే దొంగల భయం కూడా ఉండదు.
–కవిత, బుధవారపేట.

ఆకర్షణకరంగా ఉంటాయి



బంగారం ఆభరణాల ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. వీటి రేట్లు చూస్తే సామాన్యులు కొనలేని పరిస్థితి ఉంది. రోల్డ్‌గోల్డ్, వన్ గ్రామ్ ఆభరణాలు అతి తక్కువ ధరకే వస్తాయి. చూసేందుకు ఎంతో ఆకర్షణకరంగా ఉంటాయి. పార్టీలు, శుభకార్యాలు ఉన్నప్పుడు వేసుకునేందుకు కొంటాను.
–లోహిత, దేవనగర్

ఆరు నెలలకోసారి మార్చుకోవచ్చు



బంగారం ఆభరణాలు కొనుగోలు చేస్తే వాటినే ఎక్కువకాలం తొడగాలి. అమ్ముదామంటే తరుగు, ట్యాక్సు వంటి కారణాలు చెప్పి తక్కువ ధరకు తీసుకుంటారు. రోల్డ్‌గోల్డ్, వన్‌గ్రామ్ బంగారం ఆభరణాలు కొంటే ఆరు నెలలకోసారి మార్చుకోవచ్చు. ఈ మధ్య మహిళల్లో ఆసక్తి పెరుగుతోంది. –లక్ష్మి, కర్నూలు

ఈ-శ్రామ్ కలిగి ఉండాలి

కర్నూలు(రాజ్‌విహార్): అసంఘటిత రంగ కార్మికులు ఈ-శ్రామ్‌ను కలిగి ఉండాలని కార్మిక శాఖ కర్నూలు సహాయ అధికారి కేశన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న వారికి ఈ-శ్రామ్ వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, సమీపంలోని సచివాలయాల్లో దరఖాస్తు చేసుకొని గుర్తింపు కార్డులు పొందవచ్చని సూచించారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవం



మాట్లాడుతున్న డా.సునీల్‌కుమార్ రెడ్డి

కర్నూలు(సిటీ): నగరంలోని బి.క్యాంప్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు శనివారం కళాశాల ఆవరణలో ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా దంత వైద్యులు డాక్టర్ సునీల్ కుమార్ హాజరై ప్రసంగించారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని తల్లిదండ్రులకు, కాలేజీకి మంచి పేరు తేవాలని సూచించారు. జిల్లా వృత్తి విద్యాధికారి జమీర్ పాషా మాట్లాడుతూ.. విద్యార్థులు సాంకేతిక విద్యపై పట్టు సాధించాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక విద్యను నేర్చుకోవాలని సూచించారు. కాలేజీ ప్రిన్సిపాల్ షీలా సౌజన్య మాట్లాడారు. అనంతరం వివిధ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు ముఖ్య అతిథులచే బహుమతులు అందించారు. కార్యక్రమానికి ఏపీపీఎస్సీ డీఎస్పీ మహబూబ్ బాషా, ప్యాపిలి ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, కళాశాల సిబ్బంది హాజరయ్యారు. కాలేజీ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు నృత్యాలు అలరించాయి.

చెవిలో చీము కారడమూ ఓ వ్యాధే



వర్క్‌షాప్‌లో శిక్షణనిస్తున్న డాక్టర్ జయప్రకాష్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): చెవిలో చీము కారడం కూడా ఒక విధమైన వ్యాధేనని ఈఎన్‌టీ వైద్యనిపుణులు డాక్టర్ బి.జయప్రకాష్‌రెడ్డి చెప్పారు. స్థానిక ఎస్ఆర్ పేటలోని శ్రీసత్యసాయి ఈఎన్‌టీ హాస్పిటల్‌లో శనివారం 29వ హ్యాండ్స్ ఆన్ ఆంకిలోప్లాస్టీ, టింపనోప్లాస్టీ, మైక్రో ఇయర్ సర్జరీపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ శిక్షణలో డాక్టర్ జయప్రకాష్‌రెడ్డితో పాటు కర్నూలుకు చెందిన డాక్టర్ మహేంద్రకుమార్, డాక్టర్ స్రవంతి, బెంగళూరుకు చెందిన డాక్టర్ నదీమ్, డాక్టర్ చిదానంద్, రాజమండ్రికి చెందిన డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొని నూతన వైద్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ జయప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ... ఈ శిక్షణకు ఏపీ తెలంగాణతో పాటు ఒరిస్సా, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఢిల్లీ రాష్ట్రాల నుంచి నూతన వైద్యులు హాజరయ్యారన్నారు. చెవి లోపలి భాగంలో ఉన్న సూక్ష్మమైన ఎముకలు, వివిధ కారణాల వల్ల దెబ్బ తిన్నప్పుడు రోగులకు వినికిడి లోపం కలుగుతుందన్నారు. ఈ సూక్ష్మమైన ఎముకల పునర్నిర్మాణం చేసే ప్రయోగం పేరే అసిక్యులోప్లాస్టీ అంటారన్నారు. చిన్నపిల్లలతో సహా వివిధ వయసుల వారికి చెవిలో చీము కారడం ఒక జబ్బుగా గుర్తించాలని, కొన్ని వెనుకబడ్డ ప్రాంతాల్లో ఇది ఎక్కువగా ప్రబలి ఉండటం వల్ల దీనిని సహజమైన ఆరోగ్య రుగ్మతగా నిర్లక్ష్యం చేస్తారన్నారు. దీనివల్ల వినికిడి లోపం కలుగడమే కాకుండా కొద్దిమందిలో ఇతరత్రా ప్రమాదకర అనర్థాలకు దారి తీయవచ్చన్నారు.

గని లీజులకు అనుమతులు ఇవ్వొద్దు



కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కర్నూలు(సెంట్రల్): కేతవరం సిలికా సాండ్ గని లీజులకు అనుమతులు ఇవ్వరాదని కాలుష్య నియంత్రణ మండలి ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో కేతవరం, కన్నమడకల గ్రామస్తులు శనివారం ఆందోళన నిర్వహించారు. సీపీఎం నాయకుడు జి.రామకృష్ణ మాట్లాడుతూ..ఆదిమానవులు సంచరించిన ప్రాంతాన్ని కొల్లగొట్టేందుకు చూడడం బాధకరమన్నారు.అలాగే అక్కడ పేదలు సాగుచేసుకుంటున్న భూములను స్వాధీనం చేసుకొని లీజు పేరుతో పెద్దలకు అప్పజెప్పేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. కాలుష్య నియంత్రణ అధికారులు స్పందించి ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.శ్రీధర్, బి.నాగన్న తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులకు ప్రాధాన్యత



10వ వార్డులో పర్యటిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): నగరంలో పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. శనివారం స్థానిక నగరపాలక సంస్థ పరిధిలోని 10వ వార్డులో ఆయన పర్యటించారు. ఆ వార్డు కార్పొరేటర్ షేక్ యూనుస్‌బాషాతో కలిసి పారిశుద్ధ్యం సమస్యలు, వార్డులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను పరిశీలించారు. గుమ్మజ్ ప్రాంత్రం, బావర్చీవాడ, కేవీఆర్ గార్డెన్, కల్యాణ్ జ్యువెలర్స్ ప్రాంతాలలో పర్యటించారు. కార్పొరేటర్ సూచన మేరకు వార్డులో నెలకొన్న మెయిన్ డ్రెయిన్ సమస్య పరిష్కారంతో పాటు గుమ్మజ్‌లో పార్కును ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్‌వి.పద్మావతి, డీఈఈ గోపాలక్రిష్ణయ్య, ఏఈ రాచయ్య పాల్గొన్నారు.

గర్భిణులకు, పిల్లలకు టీకాలు వేయాలి



వ్యాధి నిరోధక టీకాల నమోదును ట్యాబ్‌లో పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ రామగిడ్డయ్య

కర్నూలు (న్యూటౌన్): గర్భిణులు, 5 సంవత్సరాల్లోపు పిల్లలకు ఇవ్వాల్సిన టీకాలు, ఐరన్ సిరప్‌లు క్రమం తప్పకుండా ఇవ్వాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రామగిడ్డయ్య ఏఎన్‌ఎంలను ఆదేశించారు. శనివారం కర్నూలు మండలం ఈ తాండ్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు అంగన్‌వాడీ-2 కేంద్రాన్ని, పంచలింగాల అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల స్పెషల్ డ్రైవ్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్ఓ మాట్లాడుతూ గర్భిణులకు, చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు, ఐరన్ సిరప్‌లు వేసిన తర్వాత అదే రోజు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఏఎన్‌ఎంలు ట్యాబ్‌లలో శిశు సంరక్షణ సేవలు, గర్భిణీ, కిశోర బాలికల హిమోగ్లోబిన్ పరీక్షలు, ఎన్‌సీడీ సర్వే వివరాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఈ తాండ్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని కాన్పుల, ఫార్మసి గదిని పరిశీలించారు. కార్యక్రమంలో ఈ తాండ్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సయ్యద్ ముక్తార్‌బాషా, డాక్టర్ విజయ మాధురి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

28న కబడ్డీ పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని ఎన్ కొంతలపాడు గ్రామంలో ఈ నెల 28న అంబాసహిత యాగంటీశ్వర స్వామి తిరుణాల సందర్భంగా అంతర్ రాష్ట్ర పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు తెలిపారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు మొదటి ఐదు స్థానాలకు వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు అదే రోజు ఉదయం 8 గంటలలోగా రూ.300లు ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 95021 77501, 98492 90398 నంబర్లలో సంప్రదించాలని వారు సూచించారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- గృహసారథులు, కన్వీనర్ల సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని, చిత్రంలో మేయర్ బీవై రామయ్య

కల్లూరు: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా గృహసారథులు పని చేయాలని పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్ బీవై రామయ్య పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం కల్లూరు అర్బన్ రావూరి గార్డెన్స్‌లో 19, 20, 21, 26 నుంచి 31వ వార్డుల గృహసారథుల, కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలు, కులాలు, మతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కన్వీనర్లు, గృహసారథులపై ఉందన్నారు. గత టీడీపీ పాలనలో ఆ పార్టీకి చెందిన వారికి, జన్మభూమి కమిటీ సిఫారసులు ఉన్న వారికే మాత్రమే ప్రభుత్వ పథకాలు అందేవన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పరిస్థితి మారిందని, అర్హత ఉంటే చాటు ఎవరి సిఫారసులు లేకుండానే పథకాలు అందుతున్నాయన్నారు. ప్రతిపక్ష నాయకులు నిత్యం ప్రజలకు అబద్ధాలు, అసత్యాలు చెబుతుండటంతోపాటు ఎల్లో మీడియా కూడా అసత్య ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ఇదంతా రాష్ట్రంలోని ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. గత టీడీపీ పాలనలో కంటే 43 శాతం అదనంగా పింఛన్లు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మల్లికార్జున రిజర్వాయర్‌తో కల్లూరు అర్బన్ తాగునీటి సమస్య పరిష్కారంతో పాటు ఐదు నియోజకవర్గాలకు సాగు, తాగునీరు అందుతుందన్నారు. శాసన మండలి 18 స్థానాల్లో 11 స్థానాలు వెనకబడిన వర్గాలకు కేటాయించి వారి అభ్యున్నతి ధ్యేయంగా సీఎం పనిచేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు, నంద్యాల జెడ్పీటీసీ గోకుల్ కృష్ణారెడ్డి, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, కార్పొరేటర్లు వైజా అరుణ, మిద్దె చిట్టెమ్మ, దండు లక్ష్మీకాంతరెడ్డి, నారాయణరెడ్డి, కాశపోగు జయరాముడు, లక్ష్మీరెడ్డి, కల్లూరు సింగిల్‌విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, అర్బన్ పరిధిలోని వార్డుల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్తం

27న విశిష్ట వ్యక్తుల ఆత్మీయ సమ్మేళనం

కర్నూలు కల్చరల్: విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) విశిష్ట వ్యక్తుల ఆత్మీయ సమ్మేళనం ఈ నెల 27వ తేదీ సాయంత్రం 6 గంటలకు ఎస్వీ కాంప్లెక్స్‌లోని ఎస్వీ రీజెన్సీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ నాయకులు తెలిపారు. వీహెచ్‌పీ కేంద్రీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి స్థాణుమాలయన్ ముఖ్య వక్తగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

నేడు ఆర్ఎస్ఎస్ నగర సాంఘిక్

కర్నూలు కల్చరల్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) నగర సాంఘిక్‌ను ఆదివారం ఉదయం 7 గంటలకు ఏక్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఆర్ఎస్ఎస్ నగర సంఘ చాలక్ సూరా వెంకటరెడ్డి తెలిపారు.

నేడు అవాజ్ కమిటీ జిల్లా మహాసభలు

కర్నూలు(సెంట్రల్): అవాజ్ కమిటీ జిల్లా మహాసభలను ఆదివారం ఉదయం 11 గంటలకు కేకే భవన్‌లో జరుగుతాయని, ముఖ్య అతిథులుగా కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ కుద్దూస్ ఘోరీ, సీపీఎం జిల్లాకార్యదర్శి డి.గౌస్ దేశాయ్ హాజరవుతున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎంఏ సుభాన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

27న హాకీ టోర్నీ

కర్నూలు (టౌన్): స్థానిక ఎస్‌టీబీసీ కళాశాల క్రీడా మైదానంలో ఈ నెల 27వ తేదీ ఉదయం 11 గంటలకు దాసరి సురేష్ మెమోరియల్ సెవెన్ ఏ సైడ్ హాకీ టోర్నమెంటు నిర్వహిస్తున్నట్లు జిల్లా హాకీ సంఘం కార్యదర్శి దాసరి సుధీర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు మండల స్థాయి పాఠశాలల బాల బాలికలు ఈ టోర్నమెంటులో పాల్గొనవచ్చన్నారు.

నేడు భాను సప్తమి

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం భాను సప్తమిని పురస్కరించుకొని ఉదయం 6 గంటలకు భక్తులచే ఆదిత్య అరుణ పారాయణ పూర్వక అభిషేకం, 10.30 గంటలకు అరుణ హోమం, గణపతి హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ తెలిపారు.

సుంకేసులకు ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసులకు శనివారం 1,120 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉంది. డ్యాంలో 0.634 టీఎంసీల నీరు నిల్వ ఉండగా కేసీ కాల్వకు 1,058 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

భక్తిశ్రద్ధలతో నృసింహ ఇష్టి





పాల్గొన్న గోదా గోకులం భక్తులు, గోదా కల్యాణం నృత్య రూపకాన్ని ప్రదర్శిస్తున్న దేవీ శ్రీ

కర్నూలు కల్చరల్: కర్నూలు నగర శివారులోని మామిదాలపాడు సమీపంలోని గోదా గోకులంలో నిర్వహించనున్న శ్రీరంగనాయకి గోదా సమేత శ్రీరంగనాథ పెరుమాళ్, సుదర్శన, గరుడ, ఆల్వారాచార్యుల దేవతామూర్తుల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పురస్కరించుకొని శనివారం నృసింహ ఇష్టి కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో సముద్రాల రమాకాంతాచార్య స్వామి ఆధ్వర్యంలో యజ్ఞాలు జరిగాయి. వేద పండితులు, రుత్వికులు యాగశాల ద్వారతోరణ ధ్వజ, కుంభాభిషేకం, బాలభోగ నివేదన, విష్ణు సహస్ర నామ పారాయణం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతీ మహాస్వామి అనుగ్రహ భాషణం చేశారు. నృసింహ స్వామి ఉపాసన చేస్తే సమస్త శుభాలు కలుగుతాయన్నారు. గోదాగోకులంతో కర్నూలు నగరం మరో శ్రీరంగ పట్టణం అవుతుందన్నారు. నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ నగర శివారులో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసేలా గోదా గోకులం ఏర్పాటు కావడం అభినందనీయమన్నారు.



మాట్లాడుతున్న అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి

వెంకటేశ్వర సంగీత నృత్య అకాడమీ నాగమల్లేశ్వరి, దేవిశ్రీ బృందం ప్రదర్శించిన గోదా కల్యాణ రూపకం అలరించింది. శ్రీ త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్ స్వామిజీ, శ్రీ త్రిదండి అహోబల రామానుజ జీయర్ స్వామి, శ్రీ త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి, పారిశ్రామిక వేత్త టీజీ భరత్, విద్యా సంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి, గోదాగోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, కార్పొరేటర్ విక్రమ సింహారెడ్డి, డీఎఫ్ఓ శివశంకరరెడ్డి, గోదా గోకులం సభ్యులు పాల్గొన్నారు.

'సేవ ద్వారానే బలహీన వర్గాలను చేరగలం'



మాట్లాడుతున్న వీహెచ్‌పీ కేంద్రీయ కార్యకారిణీ సభ్యులు వై.రాఘవులు

కర్నూలు కల్చరల్: సేవ ద్వారానే బడుగు బలహీన వర్గాలను చేరగలమని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) కేంద్రీయ కార్యకారిణీ సభ్యులు వై.రాఘవులు అన్నారు. కర్నూలు నగర శివారులోని విజ్ఞాన పీఠం పూర్వ విద్యార్థుల సమ్మేళనం, పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. హిందూ సమాజం కోసం పోరాడే వీహెచ్‌పీలో సేవా విభాగం ప్రముఖమైందన్నారు. 49 సంవత్సరాలుగా వేలాది మంది బాలురకు ఆహార వసతి, విద్య, వైద్య సదుపాయాలు అందించి వారి కాళ్లపై వారు నిలబడే విధంగా తయారు చేసిన ఘనత విజ్ఞాన పీఠానికే చెందుతుందన్నారు. వీహెచ్‌పీ ఏపీ ద్విప్రాంత సంఘటన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కేవలం విద్య మాత్రమే కాకుండా విద్యార్థులకు జాతీయ శీలం, వ్యక్తిత్వం, సామాజిక స్పృహ వంటి అనేక అంశాల్లో తీర్చిదిద్దుతూ ముందుకు సాగుతుందన్నారు. అదేవిధంగా విజ్ఞాన పీఠం కరస్పాండెంట్ పి.పి.గురుమూర్తి మాట్లాడారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, రామగోవిందప్ప, వి.సుబ్రహ్మణ్యంలను సన్మానించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాళిగి వ్యాసరాజ్, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ, నగర అధ్యక్షులు మద్దిలేటి, డాక్టర్ రామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.